## క్లుప్తంగా

### ప్రజలకు సేవచేయడం గొప్పవరం



మహబూబాబాద్ రూరల్: పోలీసు శాఖలో పనిచేస్తూ ప్రత్యక్షంగా ప్రజలకు సేవ చేయటం గొప్పవరమని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చోల్లేటి ఇంద్రాచారి పదవీ విరమణ సందర్భంగా ఎస్పీ సోమవారం ఆయనను శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబురావు, ఎస్సై నగేష్ పాల్గొన్నారు.

### న్యాయమైన ధరలు చెల్లించాలి

డోర్నకల్: 365ఏ నేషనల్ హైవే నిర్మాణానికి వినియోగిస్తున్న తమ భూములకు న్యాయమైన ధరలు చెల్లించాలని ముల్కలపల్లి గ్రామస్తులు కోరారు. మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామాతో గ్రామస్తులు సమావేశమయ్యారు. గ్రామానికి కొద్ది దూరంలోని ఖమ్మం జిల్లా పరిధిలోని భూములకు న్యాయమైన ధరలు చెల్లిస్తున్నారన్నారు. ఆర్ఐ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సంజాల నాగమణిమధు, మాజీ సర్పంచ్ రాంప్రసాద్, సతీష్, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, బాబు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాలు షురూ..



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో సీతారామచంద్ర స్వామి, శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజ, చక్ర, గరుడ పూజ, ధ్వజారోహణ, గరుడ ముద్దలు, తీర్థప్రసాద వితరణ జరుగుతాయని అర్చకులు తెలిపారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, నిత్య హోమం, బలిహరణ పూజలు జరిపి రాత్రి 7.31గంటలకు సీతారామచంద్ర స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

### రాజ్యాధికారం కోసం పోరాడుదాం

నెహ్రూసెంటర్: బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడుదామని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) జిల్లా అధ్యక్షులు ముంజాల రాజేందర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నేడు నిర్వహిస్తున్నామని తెలిపారు. మోకుదెబ్బ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు.

### సౌండ్ సిస్టం అందజేత



కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి జెడ్పీహైస్కూల్‌కు, ఇటీవల పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులంతా కలిసి రూ.18,500ల విలువైన బీటీఏ సౌండ్‌సిస్టంను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట కనకయ్య, ఉపాధ్యాయులు, నరేష్‌కుమార్, శ్రీనివాస్, గోపికృష్ణ, కుమారస్వామి, జావిద్, భార్గవి, రమేష్ పాల్గొన్నారు.

# ఆహ్లాదం.. ఆలస్యం

- ముందుకు సాగని మినీ ట్యాంక్ బండ్ పనులు
- తొర్రూరులో రూ.17కోట్లతో సుందరీకరణకు నిర్ణయం
- నాలుగున్నరేళ్లుగా నిలిచిన పనులు



తొర్రూరు పెద్ద చెరువు సమీపంలో నాలుగేళ్ల క్రితం నిర్మించిన దిమ్మెలు



పెద్ద చెరువు కరకట్టపై పోసిన మట్టి

తొర్రూరు: నియోజకవర్గానికో మినీ ట్యాంక్‌బండ్ నిర్మించి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలని ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లాలోని తొర్రూరు, మరిపెడ, మహబూబాబాద్ చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దాలని 2018లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా.. నిధుల లేమితో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ పనులను పూర్తి చేయిండంలో నిర్లక్ష్యం చేశారు. నిధుల మంజూరులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కోట్లాది రూపాయల విలువైన సుందరీకరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వాకింగ్, సైక్లింగ్, బోటింగ్, విద్యుద్దీపాల అలంకరణతో కళకళలాడాల్సిన చెరువులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దర్శనమిస్తున్నాయి.

**నాలుగున్నరేళ్లుగా కొనసాగని పనులు..**

తొర్రూరు పెద్ద చెరువుపై మినీ ట్యాంక్‌బండ్ నిర్మించేందుకు 2018–19లో రూ.3.60కోట్లు మంజూరు చేశారు. ఆ నిధుల్లో రూ.2.19 కోట్లు వంతెన దిమ్మెల నిర్మాణం, కరకట్ట మరమ్మతులు చేశారు. అవి పూర్తి కావాలంటే అదనంగా నిధులు కావాలని రూ.17.8 కోట్లు అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పనులకు ఆమోదం లభించకపోవడంతో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. పూర్తయిన పనులు కూడా నిరుపయోగంగా మారాయి. మినీ ట్యాంక్‌బండ్‌లో కట్ట వెడల్పు 6మీటర్ల వరకు పెంచాల్సి ఉంది. బండ్ సమీపంలో బతుకమ్మ ఘాట్, బోటింగ్ సౌకర్యం, ఆహ్లాదం కోసం పార్కు, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉంది. దాంతో హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు వాకింగ్, సైక్లింగ్ ట్రాకులు, పలురకాల పూల మొక్కల ఏర్పాటుతో సహా సుందరీకరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**కొత్త ఎమ్మెల్యేపై కోటి ఆశలు..**

కొత్త ప్రభుత్వంలో మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేసి పట్టణ వాసులకు అందుబాటులోకి తీసుకువస్తారని స్థానికులు భావిస్తున్నారు. కొత్త ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సైతం మున్సిపాలిటీ పనులపై దృష్టి సారించింది. పెండింగ్ పనులపై ఎమ్మెల్యే అధికారులను ఇప్పటికే ఆరా తీశారు. దేని వల్ల పనులు నిలిచాయో సమగ్ర నివేదికను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ బడ్జెట్, సర్వసభ్య సమావేశాల్లో ఎమ్మెల్యే పాల్గొని పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపుతానని హామీనిచ్చింది. ఎమ్మెల్యే హామీ ఇచ్చిన తరుణంలో మినీ ట్యాంక్‌బండ్ పనులు తిరిగి ప్రారంభమై పట్టణవాసులకు త్వరితగతిన అందుబాటులోకి వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**త్వరలో పనులు మొదలు పెడతాం..**



పలు కారణాల రీత్యా మినీ ట్యాంక్‌బండ్ పనులు నిలిచాయి. పనులను తిరిగి మొదలెట్టేందుకు కాంట్రాక్టర్ అంగీకరించాడు. పనులను వేగవంతంగా చేపట్టి అతి త్వరలో మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ట్యాంక్‌బండ్ నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తాం. ఎమ్మెల్యే సైతం పనుల పూర్తికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

– శాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మరిపెడ రూరల్: తండధర్మారంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏపీఎం రాములు

మరిపెడ రూరల్: మండలంలోని తండధర్మారం గ్రామంలో శిరిడి సాయిబాబా మహిళా సంఘం ఏర్పాటు చేసుకున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం రాము ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు బుజ్జమ్మ, కార్యదర్శి విజయ, ఐకేపీ సీసీలు రుక్మిణి, చందు పాల్గొన్నారు.

గార్ల: గార్లలో రబీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సొసైటీ సీఈఓ సింగు వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్వింటాల్ వరి ధాన్యం ఏ గ్రేడ్‌కు రూ.2,203, బీగ్రేడ్ ధాన్యంకు రూ.2,183 ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది భీముడు, రవి పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ వైజయంతి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు ధర కొనుగోలు కేంద్రాల్లోనే లభిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సంఘం కార్యదర్శి రాజేష్, సెంటర్ ఇన్‌చార్జ్ ఎల్లయ్య, సిబ్బంది రాజయ్య, బ్రహ్మయ్య, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: సమాజంలో ప్రతీ ఒక్కరు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీడీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు, పీడీఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బనిశెట్టి విజయ, వెంకటేష్ దంపతులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, నాయకుడు సంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు రావుల మురళీ, వెంకట్‌రెడ్డి, ఎండి.అయూబ్‌ఖాన్, తరాల వీరేష్, ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గూడూరు: కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

గూడూరు: అన్నివర్గాల ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం గూడూరు, వెంగంపేట, రాములుతండాకు చెందిన బీఆర్ఎస్, బీజేపీల నుంచి వందకు పైగా కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం దళిత డిక్లరేషన్ కార్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్ రెడ్డి, చంటి స్వామి, కొమ్మాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి**

మహబూబాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 33వ వార్డులో ఇంటింటి తలుపు తడుతూ సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ విస్తృతంగా పర్యటించారు. ప్రతి షాపునకు తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించి మానుకోట అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోదీ చేసిన అభివృద్ధితో గెలుపు



దంతాలపల్లి: మాట్లాడుతున్న సీతారాంనాయక్

దంతాలపల్లి: మహబూబాబాద్ గడ్డపై పార్లమెంట్ స్థానం గెలుస్తానని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశంలో చేసిన అభివృద్ధే పార్టీని గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో నర్సింహులపేట జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య సంగీత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్‌నాయక్, రామచంద్రరావు, గాదే రాంబాబు, మహేష్ పాల్గొన్నారు.

**ప్రచారరథం ప్రారంభం**

మరిపెడ: మరిపెడలో ఎన్నికల ప్రచార రథం ఎల్ఈడీ స్క్రీన్, పార్టీ కార్యాలయాన్ని సోమవారం బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సీతారాంనాయక్ ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికలలో తప్పకుండా కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల ప్రభారి వెంకటనారాయణరెడ్డి, గుగులోతు లక్ష్మణ్‌నాయక్, రాంబాబు, సంగీత పాల్గొన్నారు.

**చేసిన సేవలే గెలిపిస్తాయి**

దోర్నకల్: మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడిగా సీతారాంనాయక్ చేసిన సేవలే తిరిగి ఎంపీగా గెలిపిస్తాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుగులోత్ దేవా తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎంపీగా సీతారాంనాయక్ పార్లమెంటు పరిధిలోని రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. సేవ చేసే సత్తా ఉన్న సీతారాంనాయక్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో రెడ్డెబోయిన వీరభద్రం, సుమన్ పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న గుగ్గిళ్ల పీరయ్య

కొత్తగూడ: దళిత యువకుడిని చిత్రహింసలకు గురిచేసిన ఘటనలో పోలీసులు కేసును నీరు గార్చే విధంగా వ్యవహరించారని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడారు. మానవత్వం లేకుండా ఒక దళిత యువకున్ని విచక్షణా రహితంగా చిత్రహింసలకు గురి చేస్తే తూతూ మంత్రంగా కేసు పెట్టి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. హత్యాయత్నం కేసుతోపాటు ఇతర క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదరిశ అనిల్‌కుమార్, యాకయ్య, ప్రేమ్‌సాగర్, శంకర్, శ్రీశైలం పాల్గొన్నారు.

### నవోదయ సీటు సాధించిన విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ముడుపుగల్లు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ రామయ్య కుమారుడు గణేష్ జవహర్ నవోదయ పాఠశాలలో సీటు సాధించాడు. ఈసందర్భంగా ప్రతిభ అకాడమీ డైరెక్టర్ శిరీష, చిరంజీవి ఉపాధ్యాయుడు శిరంశెట్టి సురేందర్ సోమవారం గ్రామానికి వెళ్లి విద్యార్థి గణేష్‌ను అభినందించారు.

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన విద్యార్థిని పంజాల హిమబిందు నవోదయలో సీటు సీటు సాధించింది. విద్యార్థిని తల్లిదండ్రులు పంజాల బుచ్చిరాములు, అరుణ దంపతులతోపాటు గ్రామ ప్రజాప్రతినిధులు అభినందించారు.

దంతాలపల్లి: మండలంలోని గొడిశాల నగేష్, జ్యోతి దంపతుల కుమారుడు జోగేష్ నవోదయ పాఠశాలలో సీటు సాధించాడు.

### చెరువు మట్టిని ఇటుకల తయారీకి తరలిస్తే చర్యలు

నెల్లికుదురు: ఉపాధిహామీ పథకంలో కూలీలతో ట్రాక్టర్ల ద్వారా తరలించే చెరువు మట్టిని వ్యవసాయ భూముల్లో పోయకుండా ఇటుకల తయారీకి తరలిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ బాలరాజు అన్నారు. మండలంలోని వస్త్రాం తండా, రావిరాల, మధనతుర్తి, పార్వతమ్మగూడెం గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులు, తాగునీటి వసతులపై గ్రామాలను సందర్శించి పరిశీలించారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తొర్రూరు రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని ఎంపీఓ గౌస్ చెప్పారు. సోమవారం మండలంలోని అరిపిరాల, వెంకటాపురం గ్రామాలను సందర్శించిన అధికారులు బోర్లు, బావులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీఓ గౌస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 29గ్రామాల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న బోర్లు, బావులతోపాటు అవసరమైతే రైతుల వద్ద అద్దెకు బావులు, బోర్లను తీసుకోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు చర్యలు చేట్టనున్నట్లు పేర్కొన్నారు.

**తాగునీటికి సమస్య రాకుండా చూడాలి**

చిన్నగూడూరు: వేసవిలో తాగునీటికి ఎద్దడి రాకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి, డీడబ్ల్యూఓ వరలక్ష్మి మండల అధికారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై పంచాయితీ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ యాకయ్య, ఏఈ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. హాస్టల్‌లో చదువుకునే విద్యార్థులు పౌష్టికాహారంలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో శ్రీనివాస్, హత్తిరామ్, బాలు, నరేష, బాబు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఆర్.బాలరాజుకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. జిల్లా కన్వీనర్ మధు, సూర్యప్రకాష్, గుండ్ల రాకేష్, హస్మ, మహేష్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**సద్వినియోగం చేసుకోవాలి**

మహబూబాబాద్ అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు ఉచిత గ్రూప్–1 శిక్షణను అందిస్తున్నామని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ ఆర్.బాలరాజు అన్నారు. సోమవారం నలంద డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులను సంబంధిత అధికారులు ప్రారంభిచారు.

**భూమిపూజ**

గార్ల: గార్ల మండలంలోని గండి గ్రామంలో నూతనంగా నిర్మించే శ్రీరాముడి ఆలయానికి సోమవారం వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ గ్రామస్తులు భూమి పూజ చేశారు.

**పాదయాత్రను విజయవంతం చేయాలి**

బయ్యారం: రాహూల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని కోరుతూ ఈనెల 3న జిల్లా కేంద్రం నుంచి అనంతారం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు టీపీసీసీ సభ్యులు లకావత్ లక్ష్మినారాయణనాయక్ నిర్వహించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాంకుడోత్ మంగీలాల్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**నియామకంపై హర్షం**

గార్ల: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నియమించడంపై కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ హర్షం ప్రకటించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీటీసీ వెంకట్‌లాల్, శంషాద్‌బేగం, జగన్నాథం, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

**నివాళి**

గార్ల: ఐతవు మంగపతిరావు ఆశయాల సాధన కోసం యువకులు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మంగపతిరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు హరినాయక్, గోవింద్, పెద్దవెంకటేశ్వర్లు, ఎల్లయ్య, నాగమణి, రమ, సుజాత, వీరభద్రం పాల్గొన్నారు.

**తప్పులు లేకుండా జాగ్రత్తగా నింపాలి**

నెల్లికుదురు: త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఫారం 12డీని జాగ్రత్తగా తప్పులు దొర్లకుండా నింపాలని తహసీల్దార్ రాజు అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం సెక్టోరల్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు నెలకుర్తి రవీందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

**ముగిసిన 'పది' పరీక్షలు**

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మోడల్ స్కూల్‌కు చెందిన 98 మంది విద్యార్థులు ఒకేషనల్ పరీక్షకు హాజరయ్యారు. ఒకేషనల్ సబ్జెక్టు రాసిన మోడల్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు పూర్తి కాగానే కేరింతలు కొడుతూ ఇంటికి వెళ్లారు.

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఒకేషనల్ పరీక్షకు 78 మంది విద్యార్థులు గాను 76 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు.

**నూతన కమిటీ ఎన్నిక**

మరిపెడ: ఎలక్ట్రానిక్ మీడియా డోర్నకల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చలమల కిరణ్ ఎన్నికయ్యారు. మరిపెడలోని కనకదుర్గ ఫంక్షన్ హాలులో సోమవారం గౌరవ అధ్యక్షుడు గాడిపెల్లి యాదగిరి, చిమ్ముల సాయిరెడ్డి సమక్షంలో ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా బయ్య నాగరాజు, మంద ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా గండి విష్ణు, సహాయ కార్యదర్శులు చిమ్ముల సాయిరెడ్డి, దొంతు సృజన్, కోశాధికారిగా సుధాకర్, ఈసీ మెంబర్లు వీరాంజీ, వెంకటేశ్వర్లు, పత్తి ప్రభాకర్, వెంకటనారాయణ, సంజీవ, నవీన్, నగేష్, కోల యాకయ్య, అనిల్, మహేందర్, సర్వేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**భవన నిర్మాణ కమిటీ ఎన్నిక**

పెద్దవంగర: భవన నిర్మాణ కార్మిక హక్కులను సాధించుకోవడానికి సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ మండల కన్వీనర్ రాపోలు వీరన్న అన్నారు. సోమవారం మండలంలోని చిట్యాల గ్రామంలో గ్రామ భవన నిర్మాణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటుక కుమార్ ఉపాధ్యక్షుడిగా అనపురం మహేందర్, కార్యదర్శిగా పిట్టల రమేష్, పాక శ్రీను పిట్టల రాములు, సభ్యులను ఎన్నుకున్నారు.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

మహబూబాబాద్ రూరల్: మండలంలోని జంగిలిగొండ సబ్‌స్టేషన్ నుంచి రోటిబండ తండా 11కేవీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ భోజ్యానాయక్ సోమవారం తెలిపారు. రోటిబండ తండా, దూదియా తండా, సోమ్లా తండా, పర్వతగిరి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### మధ్య దళారుల ప్రమేయాన్ని అరికట్టాలి

మరిపెడ: లేబర్ ఇన్సూరెన్స్ కార్డుల జారీ విషయంలో మధ్య దళారుల ప్రమేయాన్ని ఆపాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న డిమాండ్ చేశారు. మరిపెడలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. బిల్డింగ్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం తీసుకొచ్చిన లేబర్ సంక్షేమ బోర్డుకార్డుల కోసం కొంతమంది దళారీలు ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. సమావేశంలో వెంకన్న, ఉప్పలయ్య, వీరస్వామి, యాదగిరి పాల్గొన్నారు.

### బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలి

పెద్దవంగర: బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి అన్నారు. పెద్దవంగర ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## క్రైం కార్నర్..

**గుడుంబా స్థావరాలపై దాడులు**

మరిపెడ రూరల్: మండలంలోని బావోజీతండాలో గుడుంబా స్థావరాలపై మరిపెడ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. భూక్య లాలుపై కేసు నమోదు చేసినట్లు సెకండ్ ఎస్సై సంతోష్ తెలిపారు.

**అనుమానాస్పద స్థితిలో ఒడిశా కూలీ మృతి**

బయ్యారం: మండలంలోని కాచనపల్లి సమీపంలో ఉన్న ఓ ఇటుకబట్టీలో పని చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీ అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిషా రాష్ట్రం నవరంగ్ జిల్లా కందిగూడ గ్రామానికి చెందిన బోయి సంపత్(56) ఇటుకబట్టీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పడుకున్న సంపత్ తెల్లవారుజామున లేవకపోవటంతో తోటి కూలీలు పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. దీంతో బట్టీ యజమాని ఒడిశాలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు.

**యువకుడిపై దాడి.. ద్విచక్రవాహనం దగ్ధం**

దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడిపై దాడి చేసి ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేశారు. ఎస్ఐ పోటు గణేష్ కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం కారులో నలుగురు వ్యక్తులు పర్ణశాలకు వచ్చారు. అప్పటికే అక్కడ ఓ యువతి, ఓ యువకుడు ఉండగా.. యువకుడిపై కర్రలతో దాడి చేయడంతో ఆయన పారిపోయాడు. అనంతరం పారిపోయిన వ్యక్తి బైక్‌పై పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఆతర్వాత యువతిని కారులో ఎక్కించుకుని వెళ్తుండగా పర్ణశాల గ్రామస్తులు ఆపి వివరాలు ఆరా తీశారు. తమ సోదరి ఆచూకీ కోసం రాగా, ఆమె మరో వ్యక్తితో ఉన్నట్లు గమనించామని పేర్కొన్నారు. కాగా, దాడికి పాల్పడిన యువకులు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన వారమని చెప్పగా.. స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**యువకుడి అదృశ్యంపై కేసు నమోదు**

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వికలాంగుల కాలనీకి చెందిన 19 ఏళ్ల యువకుడు మునిగె కార్తీక్ అదృశ్యమైన సంఘటనలో అతడి తల్లి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సోమవారం తెలిపారు. కార్తీక్ తన మిత్రుడి వద్దకు వెళ్లివస్తానని చెప్పి గత నెల 24వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదన్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు**

మహబూబాబాద్ రూరల్: వాహనం అదుపుతప్పి పడిపోయి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారులోగల అటవీ శాఖ అర్బన్ పార్కు వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ రెండో ఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్ నగర్ కాలనీలో నివాసం ఉండే జాని ఉదయం గూడూరు మండలంలోని తమ స్వస్థలమైన మట్టెవాడ గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా అటవీ శాఖ అర్బన్ పార్కు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.